క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మాడ్గుల: మండల పరిషత్ కార్యాలయంలోని రైతువేదిక హాల్లో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పద్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారయణరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరవుతున్నాట్లు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

మంచాల: వీఆర్ వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాపాలలో ఈనెల 14న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సంఘం బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. జాపాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని సూచించారు.గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య శిబిరం కొనగాతుందని అన్నారు.

17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు కృష్ణమాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మూలవిరాట్‌కు విరాళాల సేకరణ

యాచారం: మొండిగౌరెల్లిలో పునఃనిర్మాణం చేపడుతున్న పూరాతన శ్రీలక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించే మూలవిరాట్‌కు గ్రామస్తుల నుంచి విరాళాల సేకరణ చేపట్టారు. మూలవిరాట్‌లో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఆర్థికసహాయం ఉండాలని నిర్మాణ కమిటీ సభ్యులు నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం నిర్మాణ కమిటీ సభ్యులు చెన్నకేశవరెడ్డి, బాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనువాస్‌గుప్త తదితరులు గ్రామంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. ముందుగా గ్రామంలోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేశారు. మొత్తం రూ.1,56,570 విరాళాలు సేకరించినట్లు సభ్యులు తెలిపారు. ఇంకా ఎవరైనా విరాళాలు ఇవ్వదల్చుకుంటే ఇవ్వ వచ్చని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డలో స్వామివారి మూలవిరాట్‌ను తీసుకరావడానికి వెళ్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు ఎండీ.వలీ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మిత్రమండలి అధ్యక్షుడు షేక్.టిప్పుసుల్తాన్, నాయకులు జగన్, ఫయాజ్, రవి, వినోద్, ఇమ్రాన్, ఇస్మాయిల్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మాడ్గుల: రెండు రోజుల కిందట నాగిళ్ల గ్రామంలోని వడ్డెమోని కుమార్ కిరాణాషాప్ ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. విషయం తెలుసుకున్న రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్ల రాజుగౌడ్ వారి కుటుంబానికి సోమవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు వెంకటయ్య, సత్తయ్య, పెదయ్య, నర్సింహ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌గౌడ్‌కు పితృవియోగం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ తండ్రి సుదర్శన్‌గౌడ్ సోమవారం గుండెపోటుతో మరణించారు. మరణవార్త తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, ఇబ్రహీంపటన్నం జెడ్పీటీసీ మహిపాల్, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట రూ.19, వంకాయ రూ.35, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, కాకరకాయ 45, బీరకాయ 55, క్యాబేజీ 15, ఫ్రెంచ్‌బీన్స్ 55, క్యారెట్ 37, దొండకాయ 35-40, చిక్కుడు 23-55, గోకరకాయ 50, బీట్‌రూట్ 33, క్యాప్సికం 55, ఆలుగడ్డ 23, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ 13, ఉల్లిగడ్డ 38, చామగడ్డ రూ.40గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: మైసమ్మ సన్నిధిలోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి ఆలయానికి చేరుకున్న కసిరెడ్డి నారాయణరెడ్డికి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పూర్ణకుంభంతో ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైసిగండి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ స్నేహలత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, బీక్యానాయక్, యాట నర్సింహ, బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, జహంగీర్ బాబా, వేనుగోపాల్, శేఖర్‌గౌడ్, బాల్‌రాజ్, వెంకటేశ్, భిక్షపతి, జవహర్‌లాల్, వినోద్, లక్ష్మయ్య, అమర్‌సింగ్, వెంకట్‌రెడ్డి, సత్యం, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, జహంగీర్‌అలీ, నరేశ్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని కర్కాస్‌తండాకు చెందిన బాలు (40) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం కర్కాస్‌తండాకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే వ్యక్తిగతంగా రూ.5000, సర్పంచ్ వెంకట్రాంరెడ్డి రూ.5000, మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి రూ.3500 ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు శంకర్‌నాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేకి సన్మానం

మాడ్గుల: మాడ్గులలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం తొలిసారిగా మాడ్గులకు వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కిషన్‌రెడ్డి కోరారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్

కడ్తాల్: మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే వారిపై చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారికి ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్‌లు పలు సూచనలు చేసి, పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగించడం వల్ల చిరువ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తరుచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. రహదారితో పాటు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలను, తోపుడు బండ్లను వెంటనే తొలగించాలని చెప్పారు. రద్దీగా ఉండే మండల కేంద్రంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన సామగ్రిని తీసివేయిస్తున్న పోలీసులు

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యాదయ్య

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ రెవెన్యూ పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్ 212లో శ్మశానవాటికకు కేటాయించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెరనుంచి కాపాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. 2005లో రెండు ఎకరాల భూమిని శ్మశానవాటిక కొరకు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని.. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆ భూమి అన్యాక్రాంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉన్న సమయాన్ని అదునుగా భావించిన కబ్జాదారులు సుమారు 900 గజాల స్థలంలో ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేశారని, ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యవర్గ సభ్యురాలు అనురాధ, విజయ పాల్గొన్నారు.

ముగిసిన వేలంపాట

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సాలను పురస్కరించుకొని సోమవారం కొబ్బరికాయలు, లడ్డు, పులిహోర వేలంపాటలను ఆలయ ఈఓ స్నేహలత, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డిల సమక్షంలో నిర్వహించారు. చెన్నారంకు చెందిన భద్రప్ప రూ.46,000కు కొబ్బరికాయలు, లడ్డు, పులిహోరను రూ. 30,000కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ క్లర్క్ ఆంజనేయులు, శివశంకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎన్ఆర్ఐ విలాస్‌రెడ్డి



విలాస్‌రెడ్డిని సన్మానించిన ఉపాధ్యాయులు

మంచాల: తాను చదివిన ప్రభుత్వ పాఠశాలకు తనవంతు సహకారం తప్పక అందిస్తానని ఎన్ఆర్ఐ జంబుల విలాస్‌రెడ్డి అన్నారు. మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఆ పాఠశాలలో ఐదు తరగతులకు కేవలం నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని స్థానిక ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో ఆయన స్పందించి తమవంతు సహకారంగా ఒక సంవత్సరం విద్యా వలంటీర్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఇదే ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్నానన్నారు. ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డామన్నారు. అక్కడ మంచి ఉద్యోగం చేయడమే గాకుండా అమెరికాలోని తెలుగు వాళ్ల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం విలాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ అశ్వల బాలరాజ్, ప్రధానోపాధ్యాయురాలు సుగంధ, ఉపాధ్యాయులు రుబియాన, దివ్య, సాయికుమార్, యాదయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లమాయంపై దర్యాప్తు చేపట్టాలి: బీజేవైఎం

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే మాజీ మంత్రుల చాంబర్ల నుంచి ఫైళ్లు ఎందుకు మాయం అవుతున్నాని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి విజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నంలో ఆయన సోమవారం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన అవకతవకలు బయటపడకుండా ఉండేందుకే వివిధ మంత్రుల కార్యాలయాల్లో ఫైళ్లను దొంగలించి తీసుకెళ్తున్నట్లు ఆరోపించారు. గత ప్రభుత్వ మాజీ మంత్రుల కార్యాలయాల్లో జరుగుతున్న వరుస సంఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని.. ఫైళ్లు, ఫర్నీచర్ ఎత్తుకెళ్లేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. దర్యాప్తు చేపట్టాలన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

యాచారం: కార్తీక మాస చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాల్లోని శివలింగాలకు అభిషేకాలు చేశారు. తక్కళ్లపల్లి, యాచారం, నందివనపర్తి, గునుగల్, మాల్ తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తక్కళ్లపల్లి గ్రామంలోని గోదాదేవి పద్మావతీ సమేత వెంకటేశ్వస్వామి దేవస్థానంలో ఉన్న మరకత శివలింగానికి భక్తులు దర్శించుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, హోమాలు నిర్వహించారు.

మహాలక్ష్మితో నిరుపేదలకు మేలు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న జైపాల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రయోజనం చేకూరుతుందని పెద్దఅంబర్‌పేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సోమవారం పెద్దఅంబర్‌పేట పట్టణ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయశ్రీ, రాజేందర్, అనురాధ, కాంగ్రెస్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజు, నర్సింగ్‌రావు, అయ్యప్పరెడ్డి, నాగార్జున్, పెంటయ్య, అశోక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వరం

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని ఆ పార్టీ జిల్లా నాయకులు వీరేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉప్పరిగూడలో ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరేష్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన 24 గంటల్లోనే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని అమల్లోకి తేవడం గర్వకారణమన్నారు. విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. నాయకులు వెంకటేశ్, సురేందర్, రాంరెడ్డి, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రజినీకాంత్, శివ, జంగయ్య, రాజు, మునేందర్ పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో ఆధార్ అప్‌డేట్ కేంద్రం

తలకొండపల్లి: ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కిష్టమ్మ సూచించారు. ఆధార్ కార్డులో ఏమైనా తప్పులుంటే సరిచేసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ అప్‌డేట్ కేంద్రంలో ప్రతిరోజు 50 మందికి టోకెన్‌లు ఇస్తారన్నారు. ఈ కేంద్రం 15రోజుల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆధార్‌లో పేర్లు మార్చుట, పుట్టిన తేదీ, వేలిముద్రలు తదితర వాటిని మార్చుకోవచ్చన్నారు. దూర ప్రాంతంలో ఉన్న ఆధార్ కేంద్రానికి పోయి సరిచేసుకునే బదులు గ్రామంలోనే తప్పులను సరిచేసుకోవచ్చని చెప్పారు.మాజీ ఎంపీటీసీ యాదయ్య పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

విద్యార్థినులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థుల ప్రాజెక్టులను తిలకిస్తున్న శ్రవంతి

ఇబ్రహీంపట్నం: వినోబానగర్‌లోని నల్లకంచె గురుకుల పాఠశాల(బాలికల)లో సోమవారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి శ్రవంతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మనలోని సృజనాత్మకత వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా వెలికి వస్తుందన్నారు. చదువుతోపాటు అన్నిరంగాల్లో విద్యార్థినులు రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు మంగ, సునీత, మమత, భర్తకి జగన్, సుల్తాన, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 6వ వార్డు శ్రీ కృష్ణ దేవాలయానికి సమీపంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ పెద్దఅంబర్‌పేట పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్ సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక కౌన్సిలర్, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పాటు అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్‌రెడ్డిని కలిసిన ఏసీపీ

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీస్ రావు, ఇన్‌స్పెక్టర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, యాచారం, మంచాల సీఐలు గోవింద్‌రెడ్డి, రఘువీరారెడ్డి, సైదయ్య, కాశీవిశ్వనాథ్, డీఐ బాబ్జి నాయక్ మల్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.



ముందస్తుతో పాడి సం'క్షేమం'



- శీతాకాలంలో జాగ్రత్తలు పాటించాలి
- వెచ్చదనం కల్పిస్తేనే అధిక పాల దిగుబడి
- పశువైద్యాధికారి విశ్వేశ్వర్

మహేశ్వరం: రోజు రోజుకి చలి తీవ్రత విపరీతమవుతోంది. ఎముకల కొరికే చల్లని వాతావరణంతో నిత్యం ప్రజలు సావాసం చేస్తున్నారు. ఈ తరుణంలో పాడి పశువులు సైతం విలవిలలాడుతున్నాయి. ఇవి శీతాకాలంలో వ్యాధుల బారిన పడే ఆస్కారం ఎక్కువ ఉంది. పశువుల్లో వీలైనంత ఉత్పత్తి సామర్థ్యం రాబట్టాలంటే వాటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. శీతల గాలుల వల్ల వాటి జీర్ణ ప్రక్రియ మందగించి ఆహారం తీసుకోవడం తగ్గుతుందని దుబ్బచర్ల పశు వైద్యాధికారి విశ్వేశ్వర్ తెలిపారు. ఈ సీజన్‌లో పశువుల్లో వచ్చే అనారోగ్య లక్షణాలను గుర్తించి, త్వరగా చికిత్సలు చేయించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

శ్వాసకోశ వ్యాధులు

- చలి కాలంలో తక్కువ ఉష్ణోగ్రత వల్ల నిమోకాకై సూక్ష్మజీవులు ఊపిరితిత్తులపై ప్రభావం చూపి శ్వాసకోశ వ్యాధులకు గురి చేస్తుంటాయి. దీంతో ఊపిరితిత్తుల పొర వాపునకు గురై శ్వాసక్రియలో మార్పులు వస్తాయి. దీనికి వ్యాధి నిరోధక మందులు మేతలో కలిపి ఇవ్వాలి.
- ఈ సీజన్‌లో ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. పాడి పశువులకిచ్చే సమీకృత ఆహారంలో పాస్పేట్ సమృద్ధిగా లభించే తవుడును కలిపిన దాణాను ఇవ్వాలి. పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి.
- పశువులను పెంచే స్థలాలు శుభ్రంగా ఉండాలి. సరైన గాలి, వెలుతురు వచ్చే విధంగా మురికి నీరు నిలువ కాకుండా చేసుకోవాలి. వాతావరణంలో ఉండే ఉష్ణోగ్రతల కంటే పాకలలో ఎక్కువ ఉష్ణోగ్రత ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళలలో పశువులను ఆరుబయట కట్టేయకుండా షెడ్లలోనే ఉంచి ఇరువైపులా గోనే పట్టాలను వేలాడదీసి చలి తీవ్రత నుంచి రక్షణ కల్పించాలి. పాకలలో నేలపై రాత్రిపూట వరి గడ్డిని పరచాలి. పశువులు ఎక్కువగా ఉన్న రైతులు రూమ్ హీటర్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

టీకాలతో మేలు..

పశువులకు సోకే గొంతువాపు, గాలికుంటు తదితర అంటువ్యాధులు రాకముందే నివారణ చర్యగా వ్యాధినిరోధక టీకాలు వేయించడం మంచిది. శీతాకాలంలో వచ్చే పరాన్నజీవుల నిరోధక చర్యలు చేపట్టాలి. సర్వపరాన్న రోగ నిరోధక మందులు వాడాలి. ఆల్‌బెండల్ మందును వాడి జీర్ణ వ్యవస్థ ప్రక్రియను మందగించకుండా చూసుకోవాలి. పశువుల్లో అనారోగ్య లక్షణాలను ఎప్పటికప్పుడు గమనించాలి. పశువుల కళ్లు ఎర్రబడడం లేదా పుసులు కారడం, మేత తినకపోవడం, నెమరు వేయకపోవడం, పొట్ట కదలకుండా ఉబ్బరంగా ఉండటం, శరీరం వేడిగా, జ్వరంతో ఉండడం, పలుచటి పేడ వేయడం, వణకడం, దద్దుర్లు రావడం, పాల ఉత్పత్తి ఒకేసారి తగ్గిపోవడం, మూత్రం రంగు మారడం తదితర లక్షణాలు గమనించినట్లయితే వెంటనే పశువైద్యున్ని సంప్రదించాలి.

"తగ్గుతున్న వ్యాధి నిరోధక శక్తి



చలికాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి. అవి తీవ్ర ఒత్తిడికి గురి కాకుండా ఆరు బయట కట్టి వేయరాదు. ఈ కాలంలో పచ్చిమేత పెరుగుదల తక్కువగా ఉంటుంది. ఖనిజ లవణాలు, విటమిన్లు తగిన మోతాదులో లభించకపోవడంతో వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పశువులు వ్యాధుల బారినపడి నష్టం వాటిల్లుతుంది. దానికి నివారణగా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– విశ్వేశ్వర్, పశువైద్యాధికారి, దుబ్బచర్ల